# సారీరా టింకూ!

కె. లక్ష్మీకాంతమ్మ

ఆరోజు టింకూ పుట్టినరోజు.

పుట్టినరోజంటే చాలా చాలా 'స్పెషల్ డే'! ఆరోజు తండ్రి పొరపాట్న కూడా తన మీద చెయ్యి చేసుకోడన్న విషయం వాడికి బాగా తెలుసుకదా! అందుకే ఎన్నో రోజులుగా తన మనసులో మెదులుతున్నదాన్ని ఆచరణలో పెట్టడానికి ఆరోజునే ఎన్నుకున్నాడు వాడు.

తన పుట్టిన రోజన్న కారణంగా ఆరోజు అమ్మ కూడా తన మీద చెయ్యెత్తదన్న సంగతి వాడికి తెలుసుకాబట్టి- ధైర్యంగా ప్రొసీడ్ అయిపోయాడు.

పొద్దున్నే నిద్రలేచి తలంటిపోసి కొత్త బట్టలు తొడిగి అమ్మ సేమ్యా పాయసం గ్లాసు ఇచ్చేవరకూ బాగానే ఉండి ఆతర్వాత శ్రీకారం చుట్టాడు తాననుకున్న దానికి.

ఎనిమిదవుతున్నా ఇంకా మంచం దిగకుండా పాచి మొహంతో కాఫీ తాగి తండ్రి న్యూస్ పేపర్ని తిరగేస్తుంటే- చెంతకెళ్లి పేల్చాడు మొట్టమొదటి బాంబు.

''ఏంట్రా ఆ బద్ధకం? ఎనిమిదవుతున్నా ఇంకా మంచం దిగకుండా...''

బాంబింకా పూర్తిగా పేలకముందే అదిరిపడ్డాడు ఆనందరావు.

''రేయ్ రేయ్ ఏంట్రా నువ్వు? ఎవర్నిరా నువ్ అంటోంది?'' అన్నాడు గాభరాగా.

''నిన్నేనా...'' ఏమాత్రం జంకకుండా నడుంమీద చేతులేసుకున్నాడు టింకూ.

సహజంగానే మండిపోయింది ఆనందరావుకి!

''నాన్సెన్స్! రాస్కెల్! పెద్దా చిన్నా లేకుండా ఏంటా వాగుడు?'' అన్నాడు, కాదు అరిచాడు ఆగ్రహంగా.

''లేకపోతే ఏంట్రా? మీ నాన్న తాగుతాడని చెప్పి పాచి మొహంతో నువ్వా కాఫీ తాగాలా? అది చాలా చెడ్డల వాటు తెలుసా?'' చెలరేగిపోయాడు టింకూ.

''స్కౌండ్రల్'' అంటూ దిగ్గున లేచాడు ఆనందరావ్.

న్యాయంగా అయితే టింకూ టెంకి వాచిపోయి ఉండేదే! లేదా చెంప ఉబ్బిపోయి ఉండేదే! కానీ ఆరోజు వాడి పుట్టిన రోజన్న సంగతి గుర్తురావడంతో గాల్లోకి లేచిన ఆనందరావు చెయ్యి అలాగే ఉండిపోయింది.

అంతలో ''ఏంటండీ ఎందుకలా అరుస్తున్నారు?'' అంటూ కిచెన్‌లోంచి అక్కడికి చేరుకుంది దీప.

''ఈ బుద్ధిలేని వెధవ చూడు మమ్మీ... ఎనిమిదైనా మంచం దిగకపోగా- పాచి మొహంతో కాఫీ తాగింది గాక- పైగా నామీదే అరుస్తున్నాడు...'' ఫిర్యాదు చేస్తున్న టైప్‌లో మూలిగాడు టింకూ.

దీప కళ్లు ఇంతలేసయ్యాయి! మతి పోయినట్టే అనిపించిందామెకి కొడుకలా పిచ్చి వాగుడు వాగుతుంటే.

''ఏంట్రా అది? నాన్నగార్ని పట్టుకుని అంతలేసి మాటలంటావా?'' అనరిచింది అంకాళమ్మలా.

'యు ఆల్సో డిసర్వ్ దిస్' అనుకుని... ''అయితే ఏంటే? ఆ స్టుపిడ్ చేస్తున్న పన్లేవన్నా బాగున్నాయా?! ఇంత లేటుగానా నిద్రలేచేది? ఆ మాటకొస్తే నీ పనులు మాత్రం ఏం బావుండి చస్తున్నాయే? ఇందాక సేమ్యా కాస్తూ గ్లాసుడు పాలు ఒంపేశావు? అంత ఒళ్లు దగ్గర లేకపోతే ఎలా?'' అన్నాడు టింకూ.


ఆరోజు సాధారణమైంది గనక అయ్యుంటే వాడన్న మాటలకి వాడి వీపు విమానం మోత మోగిపోయుండేది! కానీ పుట్టినరోజు కదా! అందుకే భర్తకి మల్లే తనూ చెయ్యి పైకి లేచినా కొట్టలేకపోయింది దీప.

''అబ్బ! ఒక్క నిముషం కూడా ప్రశాంతంగా ఉండనివ్వవు గదా! ఛ! నీలాంటి తల్లి ఎవ్వరికీ ఉండకూడదు బాబూ'' అన్నాడు టింకూ తల్లి ఆగ్రహాన్ని ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా.

''ఏంట్రా ఊరుకుంటున్నకొద్దీ మరీ రెచ్చిపోతున్నావు? అమ్మా నాన్నల్తో ఇలాగేనా మాట్లాడేది?'' దీప చెయ్యి మళ్లీ పైకి లేచిందిగాని, వాడి పుట్టిన రోజన్న విషయం గుర్తుకొచ్చి అంతలోనే కిందకు వాలిపోయింది.

'వీడిగ్గాని దెయ్యం పట్టలేదుగదా?' అన్న అనుమానం వచ్చి కొడుక్కేసి అదోలా చూశాడు ఆనందరావు.

''ఏంట్రా ఆ చూపు?'' ఉరిమి చూస్తూ అరిచాడు



టింకూ. ''తెలుగులో చెప్తుంటే అర్థం కావట్లేదా నీకు?'' అరుపుని కంటిన్యూ చేశాడు.

ఆనందరావు సహజంగానే ఆవేశపడిపోయాడు.

''చంపుతా రాస్కెల్...'' ముఖం కందగడ్డలా మారిపోగా పిడికిళ్లు బిగించాడు. కానీ కొడుకుని ఒక్కదెబ్బ కూడా వెయ్యలేకపోయాడు.

''చంపుతావా? ఏదీ చంపు చూద్దాం! జీవహింస మహాపాతకం తెలుసా?'' తండ్రికేసి గుర్రుగా చూసి, తల్లివైపు తిరిగి ''కదమ్మా?'' అన్నాడు టింకూ.

ఆమె మాట్లాడగలిగే స్థితిలో ఉంటేగదా?

కొడుక్కేదో గాలి సోకిందని అప్పటికే కన్‌ఫర్మ్ చేసేసుకుని కన్నీరు నింపుకోసాగిందామె.

అది చూసి అన్నాడు టింకూ-

''ఏంటా ఏడుపు? పొద్దున్నే ఏడుపేంటి అసహ్యంగా?''

''ఏవండీ వీడికేదో అయ్యిందండీ! ఎవరైనా భూతవైద్యుడ్ని పిలుచుకురండీ...'' అంది గాభరాగా.

''అవును నాకూ అలాగే అనిపిస్తోంది'' అన్నాడు ఆనందరావు.

''భూత వైద్యుడెందుకు?'' టింకూ అమ్మా నాన్నలకేసి మార్చి మార్చి చూస్తూ అడిగాడు.

''నీకు పట్టిన దెయ్యాన్ని వదల్చటానికి...'' ఆనందరావు పళ్లు నూరుతూ అన్నాడు.

''అలాగేం? మరి రోజూ మీరు నన్నిలాగే తిట్టిపోస్తుంటారుగా? నేనే భూత వైద్యుడ్ని పిలుచుకురావాలి?'' రెండు చేతులూ నడుం మీద ఉంచుకుంటూ బోరున విరుచుకుని అడిగాడు టింకూ.

అప్పుడర్థమైంది ఆ అమ్మా నాన్నలకి వాడి బాధేమిటో.

''టింకూ!'' అన్నారిద్దరూ సంయుక్తంగా. ఇద్దరి ముఖాల్లోనూ నిండుగా దండిగా ఆశ్చర్యం!

''అవును మమ్మీ... అవును డాడీ... తాతయ్యా, చెల్లీ తప్పితే మీరిద్దరూ ప్రతి చిన్నదానికీ నన్ను తిడుతూనే ఉంటారు. అచ్చం నేను మిమ్మల్ని తిట్టినట్టే! అలాంటప్పుడు నాకెంత బాధగా ఉంటోంది ఒక్కసారైనా ఆలోచించారా?...'' టింకూ నిగ్గదీస్తున్నట్టు అలా అడుగుతుంటే ఆ పదేళ్ల పసివాడిలో ఓ బాల మేధావి కనిపించాడు వాళ్లిద్దరికీ.

''సారీరా టింకూ?!'' అన్నారు సంయుక్తంగా.

అంతే! 'దట్స్ వాట్ ఐ వాంటెడ్' అన్నట్టుగా ఓ నవ్వు నవ్వి అక్కడ్నుంచి వెళ్లిపోయాడు టింకూ.

★